క్లుప్తంగా

సాయి సన్నిధిలో దీపోత్సవం



అమలాపురం టౌన్: స్థానిక నల్లవంతెన సమీపంలో 216 జాతీయ రహదారి చెంతన గల స్వర్ణ శిఖర షిర్డీ సాయి బాబా మందిరంలో పవిత్ర కార్తిక మాసం సందర్భంగా సాయి సన్నిధిలో మంగళ వారం రాత్రి భక్తులు నిర్వహించిన దీపోత్సవం దేదీప్యమానంగా జరిగింది. మందిర ప్రధాన మండపంలో భక్తులు శివలింగం, స్వస్తిక్ రూపంలో దీపాలను అలంకరించి వెలిగించారు. సాయిరాం అనే అక్షరాలకు అనుగుణంగా దీపాలు వెలిగించడంతో సాయి మందిరమంతా శోభాయమానంగా కనిపించింది.

లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

అమలాపురం రూరల్ : కోదండరామ కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో పార్వతీ సమేత రామేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, మహన్యాసం, లింగార్చన, సుందరకాండ పారాయణం, సూర్య నమస్కారాలు, జ్యోతి లింగార్చన, లక్ష బిల్వార్చన, శాంతి కల్యాణం ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చనకు వచ్చిన భక్తులు

తాళ్లరేవు: కేశవపురంలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్షబిల్వార్చన పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అదే సామాజిక వర్గానికి చెందిన దంపతులతో ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి శివ రామకృష్ణ, వేద పండితుల బృందం పూజలు చేయించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున సంఘీయులు హాజరై అన్న ప్రసాదాలు స్వీకరించారు.

సబ్ రిజిస్ట్రార్‌గా రెయ్యా శ్రీనివాస్

యానాం: యానాం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై రెయ్యా శ్రీనివాస్‌ను నియమిస్తూ మంగళ వారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్‌శాఖ కార్యదర్శి వి జయశంకర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన స్థానిక ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్‌లో విధులు చేపడుతున్నారు. ఈయన ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై వచ్చి సబ్ రిజిస్ట్రార్‌గా సేవలందిస్తున్న పెట్ల నరేంద్రకుమార్‌ను తిరిగి ఆయన సొంతశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

బెల్టుషాపు నిర్వాహకుల అరెస్టు

ఉప్పలగుప్తం: మండలంలోని ఆయా గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు అమలాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైటీవీవీ సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితులు పరమట సత్యనారాయణ, ఆకేటి సత్యనారాయణ, కదలి శ్రీనివాసరావు, చిక్కం రాంబాబు, లంకే శ్రీనివాస్, రేలంగి వెంకటేశ్వరరావులను అమలాపురం తహసీల్దార్ కోర్టులో హాజరు పరచగా మండల మేజిస్ట్రేట్ దివాకర్ ఒక్కొక్కరికి రూ.లక్ష పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వెల్లడించారు.

గోకులాల నిర్మాణంలో అలసత్వం వద్దు



గొల్లవిల్లిలో అమృత్ సరోవర్ వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏపీడీ రాంబాబు

ఉప్పలగుప్తం: మండల పరిధిలోని గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న పశువుల గోకులాల పనులను వేగవంతం చేయాలని డ్వామా ఏపీడీ డి.రాంబాబు సిబ్బందికి సూచించారు. మండలంలోని భీమనపల్లి గ్రామంలో నిర్మించిన పశువుల గోకులాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సన్నవిల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పలు గ్రామాల్లో మస్టర్లను తనిఖీ చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గొల్లవిల్లిలో ఏర్పాటు చేసిన అమృత్ సరోవర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కుమార్, ఏపీవో రాజామణి, సిబ్బంది పాల్గొన్నారు.

పశు పోషణ భారం..!

- గ్రాసానికి తీవ్ర కొరత
- యంత్రాలతో కోతలే కారణం
- ముక్కలుగా మారటంతో చేలకే పరిమితం
- దాణా లేక పశువులను అమ్ముకోవాల్సిన దుస్థితి



చేలలో నిరుపయోగంగా ఉన్న గడ్డిని సేకరిస్తున్న కూలీలు



ఎండుగడ్డిని ట్రాక్టర్‌పై ఎగుమతి చేస్తున్న రైతు



ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కట్టలు కట్టి సిద్ధం చేసిన గడ్డి

ముమ్మిడివరం: వ్యవసాయ యాంత్రీకరణ ఓ వైపు రైతాంగానికి మేలు చేసేదే అయినా మరోవైపు పాడి పశువుల మేతకు శాపంగా పరిణమిస్తోంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా యంత్ర సహాయంతో వరికోతలు చేపడుతున్నారు. దీంతో గడ్డి ముక్కలై వరిచేలలోనే ఉండిపోతోంది. ఈ కారణంగా పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాలను ఉపయోగించి వరికోతలు కోయడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. ఉన్న గడ్డిని సైతం ఇతర ప్రాంతాలకు తరలించుకుపోవడంతో రాబోయే రోజులలో ఎండు గడ్డి కొరత ఏర్పడి పశువులను అమ్ముకొనే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల వరిపంట పాడై గడ్డి కుళ్లిపోయింది. రైతులు నామమాత్రంగానే గడ్డినిల్వలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కూలీల కొరత ఏర్పడటంతో రైతులు వరికోతలకు యంత్రాలనే ఎక్కువగా ఉపయోగించారు.యంత్రాలతో కోతలు కోయడం వల్ల గడ్డి ముక్కలై వరి చేలలోనే ఉండిపోయింది. దాదాపు 50శాతం కోతలు ఈవిధంగా చేపడ్డటం వల్ల ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడనుంది. సీజన్‌లో వచ్చిన గడ్డిని ఎండబెట్టి మేటుగా నిల్వలు పెట్టుకుని పశువులకు గ్రాసంగా ఉపయోగిస్తారు.

నియోజకవర్గంలో సుమారు 14వేల గేదెలు, 12వేల వరకు ఆవులు, ఎద్దులు ఉన్నాయి. వీటికి ఆయా సీజన్లలో ఎండుగడ్డిని గ్రాసంగా ఉపయోగిస్తారు. ప్రస్తుతం పశుగ్రాసానికి కొరత ఏర్పడటంతో ట్రాక్టర్ ఎండుగడ్డిని రూ.5వేలు వెచ్చించి కొనుగోలు చేయవలసి వస్తుందని రైతులు అంటున్నారు. గడ్డి మేటు వేయటానికి, ఎగుమతి, దిగుమతులకు మరో వెయ్యి ఖర్చు చేయవలసి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికే పశువుల ధరలు చుక్కలనంటడంతో వాటిని కొనుగోలు చేయటానికి రైతులు ముందుకు రావడంలేదు. దీంతో చాలామంది ప్యాకెట్ పాలుకే పరిమితమవుతున్నారు. దీనికి తోడు ఎండు గడ్డికి డిమాండ్ ఏర్పడటంతో రైతులు పశువులను మేపేందుకు వెనుకడుగు వేస్తున్నారు. గతంలో పెద్ద రైతులు ఎండు గడ్డిని ఉచితంగా ఇచ్చేవారని ఇప్పుడు మోపు రూ.100లకు కొనుగోలు చేయవలసి వస్తుందని చిన్నకారు రైతులు అంటున్నారు. పచ్చగడ్డి కంటే ఎండు గడ్డికోసం రైతులు ఇబ్బందులు పడవలసి వస్తోంది. నియోజకవర్గంలో సుమారు 32వేల ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరిపంట కుళ్లిపోయి గడ్డి దిగుబడి కోల్పోతుంటే.. రబీ సీజన్‌లో కూలీల కొరత వల్ల యంత్రాలతో వరి కోతలు చేపట్టడం వల్ల గడ్డికి కొరత ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు.

యంత్రాలతో గడ్డి సేకరణ

వరి కోతలు యంత్రాలతో కోయడం వల్ల ఎండుగడ్డి చేలలోనే ఉండిపోతోంది. ఈ గడ్డిని ఏరి కట్టలుగా కట్టడంలో యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఇలా చేలలో సేకరించి కట్టలు కట్టిన గడ్డిని ఇతర ప్రాంతాలకు తరలించుకు పోతున్నారు. యంత్రాల ద్వారా కట్టలుగా చుట్టిన కట్టలను ఇతర ప్రాంతాలకు తరలించడానికి సులభతరంగా ఉంటుంది. దీంతో గడ్డికి విపరీతమైన డిమాండ్ పెరిగింది.

కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాదిలంక.

తాళ్లరేవులో గర్భిణికి డెంగీ

అప్రమత్తమైన అధికారులు



డెంగీ నివారణ చర్యలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రవికుమార్

తాళ్లరేవు: తాళ్లరేవు గాంధీనగర్‌లో ఓ గర్భిణికి డెంగీ సోకడంతో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. డెంగీ సోకిన గర్భిణిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ నేపథ్యంలో మంగళ వారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పసుపులేటి రవికుమార్ స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ బొడ్డు కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రంజాన్, హెల్త్ అసిస్టెంట్‌లు కాలా ఆంజనేయులు, కెఎస్ ప్రసాద్, అభినవ, ఇళ్ల శ్రీను, ఏఎన్ఎం వంక జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

బంగారు వర్తకుల కార్తిక వన సమారాధన



వన సమారాధనలో బులియన్ అసోసియేషన్‌కు చెందిన వర్తకులు

అమలాపురం టౌన్: పట్టణ బంగారు, వెండి వర్తకల సంఘం (బులియన్ అసోయేషన్) ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ శివారు కొబ్బరితోటలో కార్తిక వన సమారాధన మంగళవారం ఘనంగా జరిగింది. బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు అధ్యక్షతన పట్టణంలోని బంగారు, వెండి వర్తకులు తొలుత ఉసిరి చెట్టుకు కార్తిక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వీరే కాకుండా పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన అన్ని రకాల వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొని ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అతిథిగా పాల్గొన్నారు. అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేసి వ్యాపారుల సంఘటితాన్ని చాటారు. పట్టణంలోని రెండు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోణం సత్య వరప్రసాద్, కల్వకొలను తాతాజీ, బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, రేకపల్లి సూరిబాబు, మానే ప్రకాష్, దుర్గా ప్రసాద్ గైక్వాడ్, పిండి శేషు తదితరులు వన సమారాధనలో సంఘీయులకు సేవలు అందించారు.



దేవాంగ కార్తిక వన సమారాధనలో సంఘీయుల సందడి

దేవాంగుల కార్తిక వన సమారాధన

అమలాపురం టౌన్: పట్టణ దేవాంగ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసర్ల గార్డెన్‌లో కార్తిక వన సమారాధనను ఆత్మీయ వాతావరణంలో సంఘీయులు మంగళవారం నిర్వహించుకున్నారు. తొలుత పట్టణ దేవాంగ పెద్దలు ఉసిరి చెట్టు వద్ద కార్తిక పూజలు చేశారు. సంఘీయులైన మహిళలు, పిల్లలు పలు పాటలు, ఆటలతో సందడి చేశారు. తనంతరం సంఘీయులంతా సహ పంక్తి భోజనాలు చేసి ఆత్మీయతను చాటారు. కార్యక్రమంలో దేవాంగ సంఘాల నాయకులు అంకం గణేష్, కాసిన రాజేంద్ర, మాడా నాగేశ్వరరావు, ఆశపు స్వామి, మావూరి రేవంత్, కాశిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి గౌరీశంకరరావు

అమలాపురం టౌన్: ఎటువంటి సమస్యలనైనా ఎదుర్కొని వాటిని పరిష్కరించుకొనే విధంగా మహిళలు చైతన్యవంతులు కావాలని అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు సూచించారు. వరకట్న వ్యతిరేక దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళ వారం న్యాయ సాధికార అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి గౌరీ శంకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సులో పాల్గొన్న బాలికలకు సమాజంలో ధైర్యంగా నిలబడే పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో జడ్జి గౌరీశంకరరావు మాట్లాడుతూ సమాజంలో పౌరులంతా రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటే శాంతి భద్రతలు సక్రమంగా సాగుతాయని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాదులు వీకేస్ భాస్కరశాస్త్రి, కేవీవీ శ్రీనివాసరావులు వరకట్న వ్యతిరేక దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవంపై ప్రసంగించారు. సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.గౌరీ శంకర్, పట్టణ ఎస్సై సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

29న గాలి గోపుర నిర్మాణానికి శంకుస్థాపన

అమలాపురం టౌన్: స్థానిక రవణ వీధి శివాలయం రోడ్డులో గల సర్వమంగళ రామలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.40 లక్షలతో నిర్మించనున్న గాలి గోపురానికి ఈనెల 29న శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ మాచిరాజు రవికుమార్ తెలిపారు. కార్తిక మాసం సందర్భంగా ఈనెల 29న ఆలయంలో జరగనున్న శత సహస్ర పంచముఖి రుద్రాక్ష పూజా మహోత్సవాల సందర్భంగా ఈ గాలి గోపుర నిర్మాణానికి రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. భక్తుల సహకారంతో గాలి గోపురాన్ని నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజ గోపుర శంకుస్థాపన, అయిదు రకాల శత సహస్ర పూజా మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

ఏవోఐ నూతన కార్యవర్గం ఎన్నిక

అమలాపురం టౌన్: ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఏవోఐ) అమలాపురం బ్రాంచికి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అమలాపురం మేథా గార్డెన్స్‌లో బ్రాంచి ఏవోబీ కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్ఐసీలో నూతనంగా వచ్చిన మార్పుల వల్ల ఏజెంట్ల వ్యవస్థకు ముప్పు వాటిలే ప్రమాదం ఎదురవుతోందని ఏవోఐ సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. వీరి సమక్షంలో అమలాపురం బ్రాంచి నూతన కార్యవర్గం ఎన్నికైంది. బ్రాంచి ఏవోఐ నూతన అధ్యక్షునిగా సానబోయిన వీరభద్రరావు, కార్యదర్శిగా ఎస్.వినాయకరావు, కోశాధికారిగా దొమ్మేటి శివస్వామి, ఎన్నికయ్యారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా నలుగురు, సంయుక్త కార్యదర్శులుగా నలుగురు, 19 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిసెంబర్ 10న రాజమహేంద్రవరంలోజరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రవి కిషోర్ పిలుపునిచ్చారు.

బీమా రంగంలో ఎల్ఐసీ అగ్రగామి

అమలాపురం టౌన్: దేశ బీమా రంగంలో ఎల్ఐసీ అగ్రభాగంలో ఉందని ముంబైలోని ఎల్ఐసీ సెంట్రల్ కార్యాలయం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతాప్ చంద్ర పాత్రో అన్నారు. ఎల్ఐసీ అమలాపురం బ్రాంచిలో సీఎల్ఐఏలో టాపర్‌గా నిలిచిన కానూరి అరవింద్ టీంకు స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమానికి చంద్రపాత్రో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఎల్ఐసీ రీజనల్ మేనేజర్ పి.చంద్రశేఖరరావు, రాజమహేంద్రవరం ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహు, సీఎల్ఐఏ మేనేజర్ పెనుగొండ రంగనాయకులు, అమలాపురం బ్రాంచి మేనేజర్ వడ్డి ప్రసన్నకుమార్ తదితరులు సీఎల్ఐఏ అరవింద్‌ను అభినందించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- హాజరైన స్థానిక ప్రజాప్రతినిధులు
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిజ్ఞలు



మురుముళ్లలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దాట్ల



అల్లవరంలో రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



తాళ్లరేవులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: ప్రజలకు స్వేచ్ఛా వాయువును ప్రసాదించిన రాజ్యాంగం భారతీయులకు ఓ పవిత్ర గ్రంథమని భారత రిపబ్లికన్ పార్టీ (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. అమలాపురం గడియారం స్తంభం సెంటరులో ఆర్‌పీఐ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన 76వ భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్‌పీఐ నేత ఈవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో లోక్ మాట్లాడుతూ రాజ్యాంగం ముందు అందరూ సమానులేనని అన్నారు. అనేక హక్కులు ప్రజలకు కల్పించిందని గుర్తు చేశారు. విశ్రాంత ప్రాసిక్యూషన్ డైరెక్టర్ ఐఎస్ మల్లేశ్వరరావు, జిల్లా దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు తదితరులు రాజ్యాంగ విశిష్టతను వివరించారు. నాయకులు రేవు తిరుపతిరావు, ములపర్తి సత్యనారాయణ, జగడం సత్యనారాయణ, అయితాబత్తుల సుభాషిణీ, కాశి వెంకట్రావు, ఉండ్రు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీఓ కె.సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

గురుకులంలో న్యాయవిజ్ఞాన సదస్సు

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా చొల్లంగిపేట గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ పూజారి పద్మావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మేజిస్ట్రేట్ నాగమల్లేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో రాజ్యాంగ ప్రియాంబుల్ చదివించి భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. అనంతరం భారత రాజ్యాంగం, విశిష్టత అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు నాగమల్లేశ్వరి బహుమతి ప్రదానం చేశారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆర్‌పీఐ అధ్యక్షుడు గిడ్డి జ్ఞాన ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రాజ్యాంగాన్ని ఈ దేశానికి అందించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. బండి కులకర్ణి, చీకురుమిల్లి శ్రీనివాస్, పంతగడి నరసింహమూర్తి, కె.వెంకట రమణ, యలమంచిలి సురేష్, పరమట యశ్వంత్, దేవరపల్లి ఏడుకొండలు, బుడితి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈ పీవీ సుధాకర్, మేనేజర్ పి.నూకరాజు, టీపీఓ రాజేష్‌బాబు, ఆర్ఐ భాస్కరరావు, జే.సత్యనారాయణరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: అన్ని వర్గాల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోడిలోని ఆయన నివాసంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన రచించిన రాజ్యాంగం కారణంగానే నిమ్న వర్గాల వారికి రిజర్వేషన్లు అందుతున్నాయన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రేవు శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. గోడిలో సర్పంచ్ తోట శ్రీదేవి ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. గోడిలంక, మొగళ్లమూరు గ్రామాల్లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాజ్యంగ దినోత్సవం నిర్వహించారు. జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు అంబేడ్కర్ పుస్తకాలను పంపిణీ చేశారు.

ఐ.పోలవరం: భారత రాజ్యాంగం మన ధర్మ శాస్త్రమని ప్రభుత్వ శాసనసభ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మంగళ వారం మురమళ్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని విధాన్ దివాస్‌ను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యదర్శి గుత్తుల సాయి, జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నారాయణరావు (బాలు), నడింపల్లి శ్రీనివాసరాజు, సాగిరాజు సూరిబాబు రాజు, పిన్నమరాజు విశ్వనాథరాజు, గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: భారత రాజ్యాంగంతో మహిళలు తమ హక్కులను సాధించుకుని, సమాజంలో హోదాలను అనుభవిస్తున్నారని సర్పంచ్ కుంచే చిట్టి కుమారి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎస్.కొత్తపల్లిలో ఆమె అధ్యక్షతన మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకటబాబ్జి, కుంచే చిన్నీ, కొంకి బాలకృష్ణ, మాదే శ్రీనివాస్, గోసంగి శ్రీను, గిడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


యానాం: నియోజకవర్గ పరిధిలో 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌నగర్‌లో అంబేడ్కర్ విజ్ఞానభవన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యానాం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల డాక్టరేట్ అందుకున్న స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ తాతపూడి ముత్యాలును సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఏఓ గిడ్డి బలరాం, పండు సిద్దార్థ కుమార్, దాట్ల దేవదానంరాజు, నక్కా వాసుదేవరావు, కోరుకొండ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

యానాం సబ్‌కోర్టులో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్జి రాజా మోహన్ న్యాయవాదుల చేత రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞను చేయించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో సైతం వేడుకలు నిర్వహించారు.

అమలాపురం రూరల్: దేశ ప్రజల నడవడికను దిశా నిర్దేశం చేసేది రాజ్యాంగమేనని అటువంటి అద్భుతమైన రాజ్యాంగాన్ని భారతదేశం తయారు చేసుకుందని ఎస్‌కేబీఆర్ బీఎడ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీఏ శ్రీనివాస్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు మంగళవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు.

'మనం.. మన రాజ్యాంగం' పుస్తకావిష్కరణ

యానాం: దక్షిణ భారత దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు, కళైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి పునర్ముద్రణ గ్రంథం మనం..మన రాజ్యాంగం పుస్తకాన్ని మంగళవారం ఆర్ఏఓ మునిస్వామి ఆవిష్కరించారు. తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల అవగాహన కోసం ఈ పుస్తకాన్ని వెలువరించానన్నారు. రాజ్యాంగం గూర్చి అనేక విషయాలు ఈ గ్రంథంలో పొందు పరిచినట్లు తెలిపారు. పుస్తకానికి ముందుమాట రాసిన కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు విషయ సేకరణ చేసి ఎంతో సరళంగా రాసిన రచయితను అభినందించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞానవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, ముర్రే మీరాసాహెబ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.



యానాంలో 'మనం..మన రాజ్యాంగం' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆర్ఏఓ మునిస్వామి, తదితరులు


కేంద్ర విధానాలపై నిరసన



ఆర్ఏఓ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

యానాం: ప్రధాని మోదీ అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపు మేరకు యానాం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి దుర్గాప్రసాద్, యానాం రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగిందన్నారు. పరిశ్రమల్లో కార్మికులకు ఉద్యోగ భద్రత కరవయ్యిందని, నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామికి వినతి పత్రం అందించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటానికి సిద్ధం కండి



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకుడు పరశురాముడు

అమలాపురం రూరల్: మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని కోనసీమ మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా అమలాపురం పట్టణం మాల మహానాడు ఆధ్వర్యంలో ఈదరపల్లి కమ్యూనిటీ హాల్‌లో మంగళ వారం సమావేశం నిర్వహించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో యువత పాల్గొనకుండా ఉంటే మాలల ఉనికికే ప్రమాదమన్నారు. త్వరలో గుంటూరులో జరిగే మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర జేఏసీ వర్కింగ్ చైర్మన్ పండు అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. మాల మహానాడు జాతీయ నాయకులు ఎంఏకే భీమారావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

అమలాపురం రూరల్: దళితసేన ఆధ్వర్యంలో పేదలకు భోజనం అందించి దుప్పట్లు పంపిణీ చేశారు. అమలాపురం నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో 100 మందికి దళిత సేన ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దళిత సేన అధ్యక్షుడు మెండి డేవిడ్, అంబేడ్కర్, పినిపే రవి కుమార్, తానంకి వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.